కథానిక

# ఆనాటి విషాదం!

"రాహి"

దూరాన్న చీకటిలో వూళ్ళోని దీపాలు అందంగా మెరుస్తున్నాయి. ఉన్నట్టుండి చిట్టి, నా వళ్లోంచి దూకి కిటికీదగ్గరికి వెళ్ళి ఆయన వళ్ళో కూచుని బైటికి చూడసాగాడు. పెద్ద మోతతో ట్రెయిను పరుగు తీస్తూంది విశాఖపట్టణం దగ్గరవుతున్న కొద్దీ చిరపరిచితమైన ఆ గాలి చెంపలకుతగిలి మనసులో ఏదో బాధల్ని రేకెత్తించసాగింది. సరిగా ఆరుసంవత్సరా లయింది, నేను విశాఖపట్టణం వదిలేసి. అప్పట్లో నాకు పరిచితమైన ఆ-కింగ్ జార్జి హాస్పిటలు....పొడుగాటి ఆ కారిడర్ .. విశాలమైన వార్డులూ ఇప్పుడెలా ఉన్నాయో? చాల మారిపోయి ఉండాయి. ఏనాటికైనా యివన్నీ నా మనసులోంచి మాసిపోవచ్చుగాని రాధాకృష్ణని మరచిపోగలనా? వుంగరాల జుట్టూ, వెడల్పాటి ఆ నొసలూ, అయస్కాంతం లాంటి కళ్ళూ....నిజానికి అతను నన్నెంత మోసంచేసి పిరికివాడిలా ప్రవర్తించినా ఎందువల్లనో అతనంటే అభిమానం అలా వుండి పోయింది అదేగా ఆడవాళ్ల ప్రత్యేకత!

ఆయన చిట్టిని వళ్ళో కూచోబెట్టుకుని ఏరాడ కొండమీది దీపాల్ని చూపిస్తున్నారు. కిటికీలోంచి తీవ్రంగా వీస్తున్న గాలిని తట్టుకుంటూ ఆనందంగా చూస్తున్నాడు చిట్టి, దీపాలకేసి. వాళ్ళకేం తెలుసు, ఒకనాడు ఆ కొండ వక్కనున్న 'వ్యాలీ గార్డెన్స్'లో ఒకరు జీవిత పర్యంతం నాతో కలిసివుంటానికి ప్రామిస్ ఇచ్చారని! తెలిస్తే నన్ను స్వీకరించేవారా? నిజంగా ఆరుసంవత్సరాల క్రితం జరిగినదంతా నేను ఓ పీడకలక్రింద తీసి పారేశాను కాకపోతే రాధాకృష్ణ పిరికితనానికి నే నెందుకు ఆహుతికావడం? జీవితాన్ని వాస్తవికదృష్టితో చూడబట్టే నేను లక్షణంగా పెళ్ళిచేసుకుని యీనాడు సంసారం దిద్దుకుంటున్నాను. రాధాకృష్ణ యిప్పుడేం చేస్తున్నాడో? ఎక్కడో గుంటూరు జిల్లాలోని తనవూళ్ళో ప్రాక్టీసుపెట్టి వుంటాడు. యీపాటికి పిల్లలతండ్రయి డబ్బు బాగా గడించివుంటాడు యీ ఆరుసంవత్సరాల్లో ఏమైనా మారివుంటాడా? ఐనా జరిగిందానికి కొంతమట్టుకు నేనూ బాధ్యురాలినే కాకపోతే ఏం మునిగిపోయిందని నేను నర్సింగ్ కోర్సుకు వెళ్ళాల్సొచ్చింది? ఐనా యిప్పుడను కొని ఏంలాభం గాని, నా యస్.యస్.యల్.సి. రిజల్ట్సు వచ్చినప్పుడు యింట్లో పరిస్థితి ఎలా వుంది? వ్యాపారం దెబ్బతినటంవల్ల నాన్న అప్పుల్లో మునిగివున్నారు. ఆర్థిక పరిస్థితి ఏమంత బాగాలేదు భూముల విషయంలో కోర్టులో దావాలు నడుస్తున్నాయి అందుకు ఆ వాతావరణాన్ని తట్టుకోలేక కాస్త మనస్థిమితంగ వుంటుందని యింట్లో వప్పించి విశాఖపట్టణం వచ్చి నర్సింగ్‌లో చేరాను. వచ్చిన కొత్తలో ఎందుకు వచ్చానా అనిపించి మనసు బాధపడింది ఏమీ తెలిసేదిగాదు. రోగులమధ్యన జీవితం ఏమిటో బాధగా, అసహ్యంగా వుండేది. కాని, రాను రాను ఒక విధమైన యింటెరెస్టు ఏర్పడి, చేసిన ప్రతిపని లోను సంతృప్తి ఫీలయ్యేదాన్ని. క్వార్టర్సులో మార్నింగ్ బెల్ చప్పుడుతో బద్ధకంగా, దూరాన్న యింకా నిదురపోతున్న విశాఖపట్టణం అందాన్ని తిలకిస్తూ లేచి, కాలకృత్యాలు పూర్తి చేసుకుని, యూనిఫారమ్ వేసుకుని హాస్పిటలుకు పోతుంటే ఎంతో సరదాగా వుండేది అన్నట్లు-నా రూం మేటు మార్గరెట్, ఆంగ్లో యిండియన్ అమ్మాయి యిప్పుడేం చేస్తున్నదో? ఎంతో సరదాగా మనస్సిచ్చి మాట్లాడేది. నన్నొదిలి ఒక్కక్షణం వుండేదిగాదు, బహుశా యీపాటికి స్టాఫ్ నర్సయి వుంటుంది, లేదా పెళ్ళి చేసుకుని సంసారం

దిద్దుకుంటున్న దేమో? రానురాను అలవాట యిన తరువాత నాకు పనిమీద మంచి యింటె రెస్టు ఏర్పడింది అప్పటికి నేను వచ్చి ఎని మిది నెలలయింది సర్జికలువార్డులో నా పోస్టింగు. అదే పానగల్లు వార్డు అంతవరకూ నాకు డాక్టర్లంటే ఎటువంటి అభిప్రాయమూ లేదు ఏదో న్గావని నేను చూసుకోవటం తప్పించి యితర విషయాలేవీ పట్టించుకునే దాన్ని గాదు. పానగల్లు వార్డుకు వచ్చిన మర్నాడే నేను మొదటిసారిగా రాధాకృష్ణని చూశాను. రాధాకృష్ణ ఆ వార్డుకు హవుస్ సర్జను ఆ నాటి పొద్దున్న నేను డయిట్‌షీట్సు రాస్తుంటే స్టాఫ్ నర్సువచ్చి, "చంద్రా! బెడ్ నెంబరు ఎయిట్ దగ్గిరికి ట్రాలీ తీసుకెళ్ళి డాక్ట రుకు సహాయం చేయి'' అన్నది నేను డయిట్ షీట్సు బల్లమీద పడేసి డ్రెస్సింగ్ ట్రాలీ తీసుకువెళ్ళాను బెడ్ దగ్గిర వోవర్ కోటు జేబుల్లో చేతులు పెట్టుకుని నిలబడి వున్నాడు, హవుస్ సర్జను రాధాకృష్ణ. అయ స్కాంతంలాంటి ఆ కళ్ళు-ఎందుకో చూచిన వెంటనే ఓ విధమైన కలవరం రేగింది నా మనసులో

"సిస్టర్! సిజర్స్-ఫోర్ సెప్స్'' అన్నాడు క్లుప్తంగా. తీసియిచ్చాను డ్రయినేజి ట్యూబ్ తీసి 'కిడ్నీట్రే'లో పడేస్తూ "అంతే సిస్టర్. యింకేంలేదు'' అన్నాడు యింగ్లీషులో, అలా అంటూ నా మొహంలోకి చూచి చిరునవ్వు నవ్వాడు సెలయేటిలో గులకరాళ్ళమీద పడి ప్రవహిస్తున్న ప్రవాహానికి మల్లే ఆ చిరునవ్వు నా హృదయాన్ని మీటింది. అదే నాకు రాధా కృష్ణతో ప్రథమ పరిచయం.

ఆ నాటి పరిచయం పదిరోజుల్లో పెద్ద దయింది. డ్రెస్సింగులు చేసేటప్పుడునవ్వుతూ, నవ్విస్తూ ఏవేవో చెప్పేవాడు స్క్రీను అడ్డంగా వుండటంవల్ల మా నవ్వులు యితరుల కంట బడేవికావు. ఓనాడు డ్రెస్సింగు చేస్తుండగా మెల్లిగా "చంద్రా! నీతో మాట్లాడాలి''అన్నాడు. "యిప్పుడు మాట్లాడండి డాక్టర్'' అన్నాను. ఎంత పరిచయం వున్నా రాధాకృష్ణని 'డాక్టర్' అనే పిలిచేదాన్ని "లేదు చంద్రా. యిక్కడ గాదు. యివ్వాళ ఆఫ్ డ్యూటీ గదూ. సాయంత్రం ఆరున్నరకు ఆఫ్థాల్‌మిక్ డిపార్టు మెంటు దగ్గిర కల్సుకో'' అన్నాడు. నా గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఎంత ధైర్యం అతనికి! నేనేమీ మాట్లాడకపోయేటప్పటికి సూటిగా నా కళ్ళల్లోకి చూస్తూ "ఏమంటావ్ చంద్రా?'' అన్నాడు ఎందుకో ఆ కళ్ళంటే నాకంత ఆక ర్షణ! సూదంటు రాయి ముందు పడేసిన యినుపమేకులా ఫీలయ్యాను వెంటనే కళ్ళు దించేసి మెల్లిగా తల వూపాను ఆఫ్థాల్‌మిక్ డిపార్టుమెంటు, హాస్పిటలు కాంపౌండులోనే వుంది ఆ డిపార్టుమెంటు ఎదురుగుండా కంకరరోడ్డు కానుకుని పెద్ద చెట్లూ....పక్కనే పెద్ద యినుకతిన్నె వున్నాయి. ఆ ప్రాంతంలో సాయం సమయాల్లో అంతగా జనసంచారం వుండదు ఎన్నోసార్లు సాయం సమయాల్లో డ్యూటీనుంచి క్వార్టర్సుకుపోతూ ఆ చెట్లక్రింద దగ్గిరగా నుంచుని మాట్లాడుకుంటున్న జంటల్ని చూశాను. కనుచీకటిలో అంత ఆప్యాయంగా మాట్లాడుకుంటున్న వాళ్ళని చూచి నేనూ, మార్గరెట్ నవ్వుకునేవాళ్ళం. సాయంకాలం సమీపించే కొలదీ గుండెల్లో ఓ విధమైన ఆరాటం బైలుదేర సాగింది. క్లబ్ రూంలో కూచుని ఆడ్తున్న ఫ్రెండ్స్‌ని జాగ్రత్తగా తప్పిం చుకుని రూంకువచ్చి బట్టలు మార్చుకుని చీకటి పడ్తుండగా మెల్లిగా బయలుదేరాను ఆరున్నరే కావడంవల్ల అంతగా జనసంచారంలేదు నైట్ డ్యూటీవాళ్ళు ఏడింటికిగాని బయలుదేరరు ఆఫ్థాల్‌మిక్ దగ్గరికి వచ్చేటప్పటికి ఓ చెట్టు క్రింద రాధాకృష్ణ ఆకారం కనబడింది నన్ను చూచిన వెంటనే ఓ అడుగు ముందుకు వేసి "వచ్చావా చంద్రా''! అన్నాడు. నా గుండె వేగంగా కొట్టుకోసాగింది నా పదిహేడేళ్ళ జీవితంలో ఓ మొగవాణ్ని వంటరిగా కల్సుకో వడం అదే మొదటిసారి. దూరాన్న సముద్రం లోని ఓడలమీది దీపాలు అందంగా మెరుస్తు న్నాయి. కాస్సేపు యిద్దరం మాట్లాడక కూచు న్నాం. చివరికి నేనే ధైర్యంచేసి "నన్నెందుకు రమ్మన్నారు డాక్టర్?'' అన్నాను.

"అదిగో చంద్రా ఒంటరిగా వున్నప్పుడు నన్ను డాక్టర్ అని పిలవవద్దని చెప్పానా? మై నేమ్ యీజ్ రాధాకృష్ణ" అన్నాడు. పేరుతో పిలవడం అంటే ఎందుకో నాకు సిగ్గు. నవ్వుతూ, "సరే యివ్వడు చెప్పండి ఏము న్నాయి నాతో మాట్లాడాల్సిన సంగతులు?" అన్నాను రాధాకృష్ణ దూరాన్న సముద్రంకేసి చూస్తూ నా చేతిని తన చేతిలోకి తీసుకుని మెల్లిగ నొక్కుతూ, "నేను చెప్పేది జాగ్రత్తగా విను చంద్రా యింతవరకు నేను జీవితంలో ఎవరికీ ప్రామిస్ యివ్వలేదు నువ్వంటే నాకు అపూర్వమైన అనురాగం ఏర్పడింది" అంటూ ఏమిటేమిటో మాట్లాడాడు ఇప్పుడవేవీ నాకు జ్ఞాపకంలేవు నేనెక్కడ అతనెక్కడ? హవుస్ సర్జన్సీ పూర్తి చేసి రేపో మాపో అసిస్టెంటు సర్జను కాబో తున్నాడు నేనేమీ మాట్లాడలేదు వాచీ చూచుకుంటూ "లెండి. టైమైంది" అన్నాను ఎనిమిదింటికి క్వార్టర్సులో వుండాలి. అతనూ లేస్తూ "మళ్ళా ఎప్పుడు కలుస్తావ్?" అన్నాడు. "రేపు వార్డుకు వస్తారుగా" అన్నాను చిరునవ్వుతో. వద్దంటున్నా వినక క్వార్టర్సు వరకూ వచ్చి, నన్ను వదిలి వెళ్ళిపోయాడు ఆఫ్ డ్యూటీ వున్న రోజున ఆప్థాల్మిక్ పక్కన కల్సుకునేవాళ్ళం. నా ప్రవర్తన గురించి మార్గ రెట్‌కు తెలియదు తెల్సినా ఏమనేది? నా 'డే ఆఫ్'నాడు రాధాకృష్ణ కాజుయల్ లీవ్ తీసు కునేవాడు. ఇరువురం 'వాలీగార్డెన్సు'కు వెళ్ళి అక్కడ ఆనందంగా గడిపి, సాయంత్రం తిరిగి వచ్చేవాళ్ళం యిలా మూడునెలలు ఆ నూతన జీవితం గడిచింది. అప్పట్లో నా విచక్షణా జ్ఞానం పూర్తిగా నశించిందనే చెప్పాలి లేక పోతే యింటిదగ్గిర అటువంటి శిక్షణలో పెరిగిన నేను యిలా విలపించే రోజుకోసం ఎదురు చూడాల్సి వచ్చేదా? ఆ రోజు రానేవచ్చింది అప్పుడు రాధాకృష్ణని భావనగర్ మెడికల్ వార్డు పోస్టుచేశారు. నేనేమో 'రేడియాలజీ' వార్డుకు పనిచేస్తున్నాను. ఎందుకో రాధాకృష్ణ వున్నట్లుండి కనబట్టం మానేశాడు రేడియా లజీలో పనిచేస్తున్న హవుస్ సర్జన్‌ని కను క్కుంటే వారం రోజులు సెలవుపెట్టి యింటికి వెళ్ళాడని తెల్సింది. పది రోజులు గడిచాయి కాని యింకా వచ్చినట్లు లేదు ఓ నాడు భావ నగర్ మెడికల్‌వార్డు మీదుగా వెళుతూ లోపలికి చూశాను. రాధాకృష్ణ వార్డులో యింజక్షన్లు యిస్తున్నాడు ఊళ్ళోకి వచ్చి కూడా నన్నెం దుకు తప్పించుకు తిరుగుతున్నాడో అర్థం కాలేదు రేడియాలజీ వార్డుకు వెళ్ళి, అక్క ణ్ణించి భావనగరుకు ఫోన్‌చేసి రాధాకృష్ణని పిలవమన్నాను ఫోనులో రాధాకృష్ణ గొంతు వినిపించింది. నా గొంతుక విని కొద్దిగా తడ బడ్డాడు. "....ఎవరు? చంద్రా! నువ్వా?" అన్నాడు "అవును నేనే డాక్టర్ వూర్నించి వచ్చి ఎన్నాళ్ళయింది?" అన్నాను

"అబ్బే. రెండు రోజులయిం దంతే. పని ఎక్కువ వుంటంవల్ల నిన్ను మీట్ కాలేక పోయాను. అచ్ఛా, వస్తా" నంటూ రిసీవర్ పెట్టేశాడు. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఇదేనా ఆ నాటి ప్రామిస్ యింతలో ఎంత మారిపో యాడు. హృదయం బాధచే కుమిలిపోయింది రెండు రోజులు దాటింతరువాత నాకు అసలు విషయం తెలిసింది ఆ నాడు డ్యూటీనుంచి క్వార్టర్సుకు వచ్చి లెటర్‌బాక్సులో చూస్తే నా పేర ఓ కవరు కనబడింది దస్తూరినిబట్టి రాధాకృష్ణ రాశాడని తెల్సుకుని వెంటనే రూంకు వచ్చి యూనిఫారమ్ తీయకుండానే, తలుపులు బిగించి కవరు చింపాను రెండు పేజీల వుత్తరం. చెప్పరాని:మోసంచేసి, ఎదుటి వ్యక్తి హృదయాన్ని గాయపరచి, "అబ్బే. నే నేం చేయను? తల్లిదండ్రుల చాటున పెరిగినవాణ్ణి. నా తప్పుల్ని క్షమించు" అని ప్రాధేయపడ్తూ పిరికితనం చాటుకుంటూ రాసిన వుత్తరం అది. ఉత్తరం చదువుతున్నంత సేపూ నా మనసు అసహ్యంతో దహించుకుపోయింది. "చంద్రా! నీకు ప్రామిస్ యిచ్చానుగాని నే నేం చేయను? ఓవైపున నువ్వంటే నా కెంతో అభిమానం. కాని అవతల తల్లిదండ్రులమీది మమతను ఎలా చంపుకోగలను? నీగురించి చెప్పానుగాని వాళ్ళు వప్పుకోలేదు నిన్ను చేసుకుంటే అమ్మ నూతిలో దుముకుతానంది ఎక్కడో నా పెళ్ళి నిశ్చయం చేసేశారు. వచ్చేనెల ముహూర్తం.

కూడా పెట్టేశారు. నే నేం చేయను చంద్రా?'' యిలా నడిచింది వుత్తరం. రాధాకృష్ణమీద నా కెంతో అసహ్యం వేసింది ఆ రాత్రంతా తల గడలో మొహం దాచుకుని ఏడ్చాను. అంత కన్నా యింకేమి చేయగలను? హృదయం బాధతో పగిలిపోయింది. వాలీ గార్డెన్సులో అతను చెప్పిన మాటలన్నీ జ్ఞప్తికివచ్చి మనసు జుగుప్సతో ముడుచుకుపోయింది. అబ్బ ఏం మగాళ్ళు!

మళ్ళా ఆ నాటి విషయాలు జ్ఞప్తికివచ్చి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అప్రయత్నంగా కళ్ళు తుడుచుకుంటుంటే, ఆయన చూచి ''ఏం చంద్రా! కంట్లో నలుసుపడిందా? జాగ్రత్త, గట్టిగా వొత్తమాక''అన్నారు చిట్టి తల బైటపెట్టి ఆయనకేదో చూపించి చప్పట్లు కొడ్తున్నాడు సిగ్నల్ యివ్వకపోవడంవల్ల ట్రెయిను ఆగి చాలా సేపయినట్లుంది అంతా నిశ్శబ్దంగా వుంది. ఆయన, వళ్ళోంచి చిట్టిని దింపి నావైపు తిరిగి ''చంద్రా! మనకు రాత్రి భోజనం ఎలా? హోటళ్లు మూసేస్తారేమో'' అన్నారు. ఈ మగాళ్ళకు ప్రతీది మతిమరుపే ''ఆ మాత్రం నాకు తెలియదా? టిఫిన్ కారియర్‌లో చపాతీలు....కూర వున్నాయి. ఏం పర్వాలేదు'' అన్నాను చపాతీలు అనేటప్పటికి చిట్టి నా వళ్లోకి దూకి ''అమ్మా! ఆకలేస్తుందే''అన్నాడు. వాణ్ణి దగ్గిరికి తీసుకుని ''యిప్పుడుగాదమ్మా.... యింటికి వెళ్ళనీ'' అన్నాను కాని వాడు విని పించుకుంటేగా. ఆయన రెండు కేకలేసి మళ్ళా దగ్గిరికి తీసుకుని దూరాన్న ఏవో చూపిస్తూ కూచున్నారు. అంతలోనే వాడు చపాతీలు మరచిపోయి దీపాల్ని చూస్తూ వుండిపోయాడు. మళ్ళా శబ్దం చేసుకుంటూ ట్రయిను బైలు దేరింది చల్లటిగాలి తీవ్రంగా కిటికిలోంచి వీస్తోంది ఆరు సంవత్సరాల క్రితం నేను విశాఖపట్నంనుంచి దెబ్బతిన్న హృదయంతో వెళ్ళిపోయాను. మళ్ళా యీ నాడు ఆనంద హృదయంతో-నన్ను కంటిరెప్పలా చూచుకొనే భర్తతోనూ, నా ప్రతిబింబమైన చిట్టితోనూ వెళ్తున్నాను.

ఆ నాడు - నేను విశాఖపట్నం విడిచి వెళ్ళి పోతుంటే మార్గరెట్ ఎంతో బాధపడింది. కాని నేను ఎవరి మాటలూ చెవినిపెట్టలేదు రాధా కృష్ణ వుత్తరం నా మనసులో తుఫాను లేపింది. జీవితంమీద మమతపోయి మగాళ్ళంటే ఓ. విధ మైన అసహ్యం ఏర్పడింది ఇక కింగ్‌జార్జి హాస్పిటల్లో వుండ మనస్కరించలేదు యింటికి వుత్తరంకూడా రాయకుండా వెంటనే రిజైన్ యిచ్చేసి రైలెక్కేశాను. ఆ నాటి నా చొరవ తలుచుకుంటే యిప్పటికీ నాకు ఆశ్చర్యంగా వుంటుంది. యింటిదగ్గిర, హఠాత్తుగా వచ్చిన నన్ను చూచి అమ్మ ఆశ్చర్యపోయింది. ''ఏమమ్మా - సెలవుమీద వచ్చావా? ఎంత కాలం?'' అన్నది నేను నవ్వుతూ ''విశాఖ పట్నమంటే అసహ్యం పుట్టిందమ్మా! వుద్యోగం వదలి వచ్చేశాను'' అన్నాను. అమ్మ ఏమీ మాట్లాడలేదు. ఆ వుద్యోగం వదిలేసినందుకు సంతోషించింది నాన్న సాయంత్రం షాపు నుంచివచ్చి నా సంగతి విని ''నేను చెప్పాను కదమ్మా నీకు వుద్యోగం ఎందుకు చెప్పూ.... వద్దంటే వినక వెళ్ళావు వచ్చేయటం మంచి పని చేశావు' అన్నాడు మామూలు జీవిత విధుల్లో కొంతకాలానికి రాధాకృష్ణని మనసు లోంచి తుడిచి పారేయ గలిగాను తరువాత ఆయన నా జీవితంలో ప్రవేశించారు నాన్న వ్యాపార విషయంలో రాజమండ్రి వెళ్ళివస్తూ ఓనాడు యిద్దరు కొత్త మనుషుల్ని తనతో తీసుకువచ్చారు పెళ్ళిచూపులకు వచ్చారని తెలిసి నా మనసు సిగ్గుతో ముడుచుకు పోయింది. వెనక హృదయానికి తగిలిన దెబ్బ మానేయడంవల్లనూ, జీవితంమీద ఓ విధమైన వాస్తవిక దృక్పథం అలవడటంవల్లనూ, నాన్న అంగీకారాన్ని నా అంగీకారంగా భావించి పెళ్లికి ఒప్పుకున్నాను ఆయన బి ఏ ప్యాస్ అయ్యారు. అమలాపురంతాలూకాలో మామిడితోటలుకూడా వున్నాయట. అన్నివిధాలా మంచి సంబంధ మని నాన్న నాతో స్వయంగా చెప్పి ఒప్పిం చారు.

నిజంగా జీవితమనేది చాల విచిత్రమైనది. నా విషయం తలచుకుంటే నాకే ఆశ్చర్యంగా వుంటుంది. మా యిద్దరి వివాహ

ఫలితమే చిట్టి. యిటువంటి ఆనందంలో తరువాత నాకు రాధాకృష్ణ విషయం జ్ఞప్తికి రాలేదు. ఏమైతే నాకేం? తను సంపాయించింది తన పెళ్ళాం పిల్లలకుపెడ్తూ యింకెవర్నీ ఏ విధంగానూ మోసం చేయకుండావుంటే అదే పదివేలు అయినా యిప్పుడవన్నీ ఎందుకు? మళ్ళా నేను విశాఖపట్టణం చూస్తానని అనుకున్నానా? భగవంతుని దయవల్ల ఆయనకు కాల్టెక్సులో ఉద్యోగం దొరికింది యిప్పుడు కింగ్‌జార్జి హాస్పిటలు ఎలావుందో? చాలా మారిపోయి వుంటుంది కొత్తవార్డులు కట్టి వుంటారు. ఆప్తాల్‌మిక్ డిపార్టుమెంటు ఎదురుగా అప్పట్లో కడ్తున్న వార్డులు యిప్పుడు పూర్తయిపోయి వుంటాయి క్వార్టర్సులోని ఆ మెస్ ఏమైనా బాగుపడిందో లేదో, అన్నట్లు ఆ బ్రదర్ ట్యూటర్. సిస్టర్ ట్యూటర్లూ ఎలా వున్నారో—మార్గరెట్ ఎక్కడుందో? ఓ సారి ఎప్పుడన్నా తీరికచేసుకుని వెళ్ళి చూడాలి. ఉహుఁ....మళ్లీ అవన్నీచూస్తే వెనకటి విషయాలు జ్ఞప్తి కొస్తాయి చూడక పోవటమే మంచిది.

"చంద్రా! స్టేషను వస్తూంది" అంటూ ఆయన చిట్టిని వళ్ళోంచి కిందికిదింపి సామాను ముందుకు లాగసాగారు వాల్టేరు స్టేషనులోకి ట్రెయిను మెల్లిగావచ్చి ఆగింది ప్లాట్‌ఫారమంతా సందడిగావుంది చిట్టిని తీసుకుని ప్లాట్‌ఫారం మీదకి అడుగు పెట్టాను ఆరు సంవత్సరాలక్రితం ఏ వూరునించి బ్రతుకుమీద విసుగుపుట్టి పారిపోయానో, ఆ వూరికే మళ్ళా కొత్తవూహలతో. ఆశలతో చేరుకున్నాను. ★

---

(16-వ పేజీ తరువాయి)

ఉత్సాహవంతంగాను మరింత ప్రయోజనకారిగానూ సాగుతుందనడానికి సందేహంలేదు. ఈ కృషి అత్యంత వైభవంగా సాగించడం మన యాంధ్రులందరికీ క్షేమకరం, ఆంధ్ర ప్రదేశ్ అంతటికీ గౌరవ ప్రతిష్ఠాకరం అందుచేత ఈ విషయంలో ఉదారవంతులయిన శ్రీమంతులు చేయూతనిచ్చి తోడ్పడుదురుగాక! అలాంటి సహాయంవల్ల ఒక ఉద్గ్రంథం ఇంగ్లీషులోకి తెచ్చి సాలంకృతంగా ప్రకటించిన దృష్టాంతం ఒకటి చూపవచ్చు అది జి వి కృష్ణారావు గారు వ్రాసిన కళాపూర్ణోదయ విమర్శ. ఇది ఇంగ్లీషులో వ్రాసినందుకు కృష్ణారావుగారికి డాక్టరు డిగ్రీ లభించింది.

ఇందులో గ్రంథకర్త కళా పూర్ణోదయం సాహిత్య విశేషాలను చక్కగా చర్చించి చూపించడమే కాక, సౌందర్యసమీక్ష, రస సంవాదమూ చేసి, ప్లేటో, అరిసోటిల్ మొదలయిన పాశ్చాత్యుల నిర్వచనాలతో పాటు మన కావ్య మీమాంస కర్తల వాదాలను సరిపోల్చి వాటి మౌలికవిషయాలను సవిమర్శంగా ప్రస్తావించారు తెనుగులోని ఒక గొప్ప కావ్యాన్ని ఇతర భాషలవారికి సోదాహరణంగా పరిచయం చేశారు. ఇది అత్యుత్తమ తరగతికి చెందిన కృషి.

ఇలాగే ఇంగ్లీషు భాషవల్ల తెనుగు సాహిత్యంమీద పడిన ప్రభావాన్ని గూర్చి సవిస్తరంగా పరిశోధనలు చేసి శ్రీ కొత్తపల్లి వీరభద్రరావుగా రొక ఒక బృహత్ గ్రంధాన్ని ఇంగ్లీషులో వ్రాసియున్నారు. దీనికే వారికి ఆంధ్ర విశ్వకళా పరిషత్తు తరఫున డాక్టరు డిగ్రీ లభించింది. ఇదికూడ ప్రచురణభాగ్యం పొందితే ఆధునికాంధ్ర సాహిత్యంలో వచ్చిన అనేక పరిణామాల గూర్చి ఆంధ్రులకు ఆంధ్రేతరులకు ఎన్నోనూతనవిషయాలను పరిచయం చేయగలదు.

మొత్తంమీద తెలుగు గురించి ఇంగ్లీషులో కొన్ని ప్రచురణలు వస్తున్నవి. కాని అవి చాలవు. వాటిని తేగల సమర్థు లున్నారు. వ్రాయగల ప్రజ్ఞావంతు లున్నారు. ప్రచురించ గల ప్రముఖు లున్నారు కాని వాటిని ఆదరించే ఆంధ్ర మహాజనుల ఉదాసీనతవల్ల అవి రావలసినన్ని రావడంలేదు. తెలుగు గురించి ఇంగ్లీషులో ఎన్ని మంచి గ్రంథాలూ వ్యాసాలూ వస్తే అంత మంచిది. వచ్చినవి తెలుగు వెలుగుల్ని మంచి కోణాలలో ప్రదర్శించేవిగా ఉండాలి. ఉల్లేఖించిన వారికీ ఉల్లేఖ్యమైనవారికీ గౌరవకారణాలు కావాలి ★